క్లుప్తంగా

కుంటను కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కందుకూరు: కుంట భూమిని తమ పేరుపై మార్చుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల పరిధిలోని అన్నోజిగూడకు చెందిన మాజీ ఉప సర్పంచ్ గొర్రెంకల యాదయ్య సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. కందుకూరు రెవెన్యూ సర్వే నంబర్ 138లో మంగలోని కుంట భూమి 1.23 ఎకరాలను అన్నోజిగూడకు చెందిన ఢిల్లీ యాదయ్య, అతని సోదరులు పట్టాగా మార్చుకొని ప్రభుత్వం నుంచి వచ్చే రైతు బంధు వంటి వాటిని అక్రమంగా పొందుతున్నారన్నారు. పట్టాగా మార్చుకున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని, కుంట భూమిని ప్రభుత్వ భూమిగా నమోదు చేయాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

కందుకూరు: సైబర్ నేరాలు, డ్రగ్స్‌తో కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సీఐ సీతారామ్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పులిమామిడి జిల్లా పరిషత్ పాఠశాలలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఆయన విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల అలవాటుతో తమ భవిష్యత్‌తో పాటు కుటుంబాలు నిర్వీర్యం అవుతాయన్నారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, వాటికి సంబంధించిన కేసులపై కనీస పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సహాయం కోసం 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సైదులు, హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి



ఆలయం వద్ద పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు

తుక్కుగూడ: కార్తీక మాసం సందర్భంగా నాగుల చవితి వేడుకలను మంగళవారం పుర పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకాలంకరణ, పూజలు చేశారు. ఆలయం ఎదుట ఉన్న పుట్టకు మహిళలు ప్రత్యేక పూజలు చేసి, పాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈట మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్‌లోని మున్సిపల్ కాలనీలో డ్రైనేజీ, అదేవిధంగా గ్రీన్ రిచ్ కాలనీలో సీసీరోడ్ల నిర్మాణ పనులను మంగళవారం మేయర్ చిగురింత పారిజాత ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈఈ నర్సింహరాజు, ఏఈఈ వినీల్‌గౌడ్ సిబ్బంది కాలనీవాసులు, మహిళలు ఉన్నారు.

కమిషనర్‌కు ఫిర్యాదు



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్ మారుతీనగర్ కాలనీలో ఉన్న ఓపెన్ ల్యాండ్‌ను కబ్జా రాయుళ్ల చెర నుంచి కాపాడాలని మంగళవారం బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి మున్సిపల్ కమిషనర్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీకి చెందిన ఓపెన్ ల్యాండ్‌ను కబ్జా చేసి భారీ ఎత్తున కట్టడాలను చేపడుతున్నారన్నారు. గతంలో ఈ స్థలంలో టీపీఓ ఆధ్వర్యంలో ఓపెన్ ల్యాండ్ అని సూచికబోర్డు పాతారని గుర్తుచేశారు. ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని వినతిపత్రంలో విన్నవించారు. కార్యక్రమంలో సైదులు, మహేందర్ ఉన్నారు.

పేదలకు నిర్మిస్తే .. పెద్దలకు ఆదాయం!

- కాసులు కురిపిస్తున్న కమ్యూనిటీహాళ్లు
- జీహెచ్ఎంసీ నిర్వహించాల్సిన బాధ్యత ప్రైవేట్ వ్యక్తులకు..
- ఇష్టానుసారంగా అద్దెల పెంపు
- ఇబ్బందులు పడుతున్న బస్తీ, కాలనీవాసులు
- స్పందించని ఉన్నతాధికారులు



ఐఎస్‌సదన్‌లోని వినయ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్

సైదాబాద్: గతంలో పుట్టినరోజు, నిశ్చితార్థం వంటి శుభకార్యాల కోసం ఇళ్ల ముందు టెంట్‌లు వేసి నిర్వహించుకునేవారు. ఇప్పుడు కాలం మారింది. చిన్నపాటి కార్యం ఉన్నా కనీసం కమ్యూనిటీ హాళ్లో నిర్వహించుకుంటున్నారు. గార్డెన్ హాళ్లు, ఫంక్షన్ హాళ్లు, బాంకెట్ హాళ్లు వంటివి పేద, మధ్య తరగతి వారి శుభకార్యాలు నిర్వహించుకునేందుకు అందుబాటు ధరల్లో దొరకవు. ఆయా వర్గాల వారి చూపు తమ కాలనీ, బస్తీలో ఉన్న కమ్యూనిటీ హాళ్ల వైపు చూస్తారు. పేదవారి ఫంక్షన్ హాళ్లగా పేరుగాంచిన కమ్యూనిటీ హాళ్లు సైతం ఇప్పుడు రూపు మార్చుకున్నాయి ఒకప్పుడు నామమాత్రపు ధరల్లో అందుబాటులో ఉండే కమ్యూనిటీహాళ్లకు అద్దె ధరలను అమాంతంగా పెంచడంతో పేదలు ఏదైనా కార్యక్రమం నిర్వహించాలంటే వాళ్ల జేబులు గుల్ల వుతున్నాయి.

వారు చెప్పిందే రేటు..

గ్రేటర్ హైదరాబాద్‌లోని 150 డివిజన్లలో ఆయా కాలనీలు, బస్తీల్లో కమ్యూనిటీ హాళ్లను నిర్మించేది జీహెచ్ఎంసీ నిధులతోనే. ప్రజలకు సమగ్ర మౌలిక వసతులు కల్పించాలన్న లక్ష్యంతో నిర్మించిన కమ్యూనిటీ హాళ్లు దారి తప్పుతున్నాయి. జీహెచ్ఎంసీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాళ్లను నిర్వహణ కోసం ఆయా కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాలకు అప్పగిస్తాయి. కమ్యూనిటీ హాళ్లను తాము నిర్వహించలేమన్న కారణంగా అధికారులు సంక్షేమ సంఘాలకు అప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. అదే అదనుగా చేసుకుంటున్న కొందరు ప్రైవేట్ వ్యక్తులు వాటిని తమ ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీలల్లోని కమ్యూనిటీ హాళ్ల అద్దెలను అమాంతంగా పెంచేశారు. ఇంత అద్దె ఎందుకు అని వారిని అడిగే నాథుడే కరువయ్యాడు. వారు చెప్పిందే రేటు, పెట్టిందే నియమంలా వ్యవహరిస్తున్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని వినయ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్, సైదాబాద్ కాలనీలోని సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి భవనం కమ్యూనిటీ హాల్, ఎస్‌బీహెచ్ కాలనీ, జీపీ కాలనీల్లోని కమ్యూనిటీ హాళ్ల అద్దెలను పెంచడంతో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలంటే వాటికి చెల్లించే అద్దెపై ఆలోచించాల్సిన దుస్థితి నెలకొంది.

కమీషన్లు ఇచ్చే వారికే నిర్వహణ బాధ్యతలు..

అధికారులు కమ్యూనిటీ హాళ్లను తమకు అప్పగించిన తర్వాత తమ ప్రాంత ప్రజలకు అనువుగా ఉండాల్సిన హాళ్లను కొన్ని సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆదాయానికి వనరుగా మార్చుకుంటున్నారు. వాటి నిర్వహణ బాధ్యతను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తున్నారు. వారితో చేసుకునే ఒప్పందాలలో హాళ్లకు నామమాత్రపు అద్దె తీసుకోవాలని నిర్ణయిస్తారు. కానీ ఇక అక్కడి నుంచి వారి అక్రమాలు మొదలవుతున్నాయి. నిర్వహణ బాధ్యత తీసుకున్న వారు హాళ్ల అద్దెను తమ ఇష్టారాజ్యంగా నిర్ణయిస్తున్నారు. సంఘం ప్రతినిధులు తమకు కమీషన్లు ఇచ్చే వారికే నిర్వహణ బాధ్యతలు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హాల్‌కు అద్దె రూపంలో వసూల్ చేస్తూనే శుభకార్యాల నిర్వహణకు అవసరమైన కుర్చీలు, టేబుళ్లు, వంట సామగ్రికి అదనంగా వసూలు చేస్తున్నారు. ఇక్కడ మరో ట్విస్ట్ ఏంటంటే కమ్యూనిటీ హాల్‌లో ఏదైనా ఫంక్షన్ చేసుకోవాలంటే హాల్‌కు అద్దె కట్టిన తర్వాత ఫంక్షన్‌కు అవసరమైన టెంట్, వంట సామగ్రి వారి వద్దనే అద్దెకు తీసుకోవాలి. బయటి నుంచి తెచ్చుకుంటే ఒప్పుకోరు. హాల్‌కు అద్దె కాకుండా అదనంగా సొమ్ము రాబట్టుకునేందుకు సామగ్రి అద్దె పేరుతో వసూళ్లు చేస్తున్నారు. ఐఎస్‌సదన్ డివిజన్‌లోని వినయ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఇదే తరహా పెద్ద ఎత్తున అద్దెల రూపంలో వసూళ్లు చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.



సైదాబాద్ కాలనీలోని కమ్యూనిటీ హాల్

ధరలు పెంచితే ఫిర్యాదు చేయండి



కాలనీలు, బస్తీల్లోని కమ్యూనిటీ హాళ్లను నిర్దేశించిన ధరలకే ఇవ్వాలి. ధరలు పెంచితే మాకు ఫిర్యాదు చేయండి. నిజమని నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటాం. కమ్యూనిటీ హాళ్లు పేద, మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండాలనే నిర్మిస్తాం. జీహెచ్ఎంసీ నిధులతో నిర్మించే హాళ్లను ఆదాయ వనరుగా మార్చుకుంటే ఉపేక్షించబోం. ప్రజలు నిర్భయంగా మా దృష్టికి తీసుకురండి. –జయంత్, మలక్‌పేట సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్

అధికారులు దృష్టి సారించాలి

పేదల ఫంక్షన్ హాళ్లు అయిన కమ్యూనిటీహాళ్లపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి. పలు కమ్యూనిటీ హాళ్ల నిర్వహణపై ధరలు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పేదల సౌకర్యార్థం నిర్మించే హాళ్లను వ్యాపారాలకు ఉపయోగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజాధనంతో నిర్మించే హాళ్లకు తిరిగి ప్రజ లు అధిక మొత్తంలో అద్దె చెల్లించాల్సి పరిస్థితి రావడం బాధాకరం.
–మెట్టు భాస్కర్‌రెడ్డి, ఐఎస్‌సదన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు



మాట్లాడుతున్న కమిషనర్ జ్ఞానేశ్వర్

కుటుంబ సర్వేకు సహకరించాలి

మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్

మీర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు పట్టణ ప్రజలంతా ఎన్యూమరేటర్లకు పూర్తి సమాచారం ఇచ్చి సహకరించాలని మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ కోరారు. కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్యూమరేటర్ల శిక్షణ కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేషన్‌లో ఈ నెల 6 నుంచి 18వ తేదీవరకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కొనసాగుతుందని, ప్రతిఒక్కరూ వారి కుటుంబ వివరాలను, అడిగిన సమాచారాన్ని సిబ్బందికి తెలపాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా అర్హత కలిగిన కుటుంబాలు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్యూమరేటర్లకు సర్వే ఫారంపై అవగాహన కల్పించి, ఎలాంటి తప్పులు లేకుండా సర్వే చేపట్టి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, ఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, మెప్మా ఇన్‌చార్జి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



గుంతలను పూడ్చి వేయిస్తున్న అంబేద్కర్ సంఘం ప్రతినిధులు, నాయకులు

రోడ్డుకు మరమ్మతులు

కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లి నుంచి నేదునూరు వెళ్లే దారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన బాచుపల్లి గ్రామానికి చెందిన అంబేద్కర్ సంఘం ప్రతినిధులు మంగళవారం మూడు టిప్పర్ల మొరం తెప్పించి జేసీబీ యంత్రంతో గుంతలను పూడ్చి తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు యుగేంధర్‌రెడ్డి, బాలగౌని రమేశ్‌గౌడ్, కృష్ణగుప్తా, కుమారి అంజయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కందుకూరి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు కృష్ణ, మద్దెల శ్రీశైలం, వెంకటేశ్, ఉపాధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి విజయ్, సభ్యులు రాజశేఖర్, కత్తుల శ్రీశైలం, వలిగే కృష్ణ, యాలాల రాఘవేందర్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వారితో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

దళితులకు అన్యాయం చేస్తే ఉపేక్షించం

- సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య
- నేదునూరులో కొనసాగుతున్న భూ పోరాటం

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరు గ్రామంలో రెవెన్యూ సర్వే నంబర్ 154లోని 1.35 ఎకరాల ఇనాం భూమికి సంబంధించి సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన భూ పోరాటం మంగళవారానికి తొమ్మిదో రోజుకు చేరింది. కాగా ఆర్ఐ శ్రీకాంత్ ఆ భూమిని సందర్శించి పంచనామా చేసి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య దళితులకు మద్దతుగా పాల్గొని మాట్లాడారు. ఎన్నో ఏళ్ల దళితులు వెట్టిచాకిరీ చేస్తే ఆ భూమిని అప్పట్లో ఇనాంగా ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఆ భూమి ఆక్రమణకు గురైందన్నారు. దళితులకు అన్యాయం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుర్డీరపు శ్రీనివాస్, సభ్యులు అంకగళ్ల కుమార్, బుట్టి బాల్‌రాజ్, గ్రామ కార్యదర్శి మిద్దె యాదయ్య, వంగూరు యాదయ్య, గడ్డమీది రాములు, బాతుక జంగయ్య, బొర్ర సురేష్, రంగని జంగయ్య, రంగని చెన్నయ్య, మిద్దె రాజయ్య, మహిళలు పాల్గొన్నారు.

సర్వేను పారదర్శకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హేమలత

మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలత

తుక్కుగూడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనను అధికారులు, సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని పురపాలక సంఘం చైర్‌పర్సన్ బరిగెల హేమలతరాజుగౌడ్‌లు సూచించారు. మంగళవారం పుర కార్యాలయంలోని సమావేశం మందిరంలో కులగణన అంశంపై కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గణన చేపట్టే సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటా తిరిగి వివరాలను సేకరిస్తాంచాలన్నారు. ఈ గణన ద్వారా సమాజంలో వెనుకబడిన వర్గాలవారికి రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ, తదితరులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఎన్యూమరేటర్లు వారికి కేటాయించిన గృహాల వివరాలను పూర్తిచేయాలన్నారు. కౌన్సిలర్లు తమవార్డులో ఉన్న ప్రజలందరూ అధికారులకు సహకరించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వాణి, మేనేజర్ పర్వతాలు, కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, శివకుమార్, రాజు, భావన, లావణ్య, పద్మ, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎంరిలీఫ్ ఫండ్ పేదల ఆరోగ్యానికి భరోసా అన్నారు.

డివిజన్ అభివృద్ధే లక్ష్యం



రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: డివిజన్ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు.దుర్గాభవానీనగర్ కాలనీలో రూ. 50 లక్షల నిధులతో ప్రారంభించిన సీసీరోడ్డు పనులకు మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కాలనీల్లో పనులు జరిగేటప్పుడు స్థానికులకు కాస్త ఇబ్బందులు తలెత్తుతాయని స్థానికులు సంయమనం పాటించి అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్పొరేటర్ వెంట రమేష్‌రెడ్డి, నిషీకాంత్‌రెడ్డి, నాగేశ్వరరావు, రాజేందర్‌గౌడ్, రత్నంచారి, శ్రీధర్‌రెడ్డి, కుమార్ నాయకులు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ నాయుడు, సుమిత్‌సింగ్ ఉన్నారు.

బేగంపేట్‌కు తరలిన నాయకులు

మహేశ్వరం: రాష్ట్రంలో జరగనున్న కులగణన సర్వేపై దిశానిర్దేశం చేసేందుకు హైద్రాబాద్‌కు విచ్చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి స్వాగతం పలికేందుకు మహేశ్వరం మండలం నుంచి కాంగ్రెస్ నేతలు మంగళవారం భారీగా తరలివెళ్లారు. కాంగ్రెస్ నియోజకర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డిల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు మండలాలతో పాటు తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలు, బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లు, సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్‌ల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో బేగంపేట్ ఎయిర్‌పోర్టు వరకు భారీగా ర్యాలీ నిర్వహించి రాహుల్ గాంధీకి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు కాకి ఈశ్వర్, . ఉపేందర్‌రెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్, పాండునాయక్, అల్లె కుమార్, శివ, కృష్ణానాయక్, గోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రావు, రాజ్‌కుమార్, లాజర్, నర్సింహా, రాజునాయక్, భూపాల్‌రెడ్డి, బాల్‌రాజ్, గౌస్, శ్రీధర్, జంగయ్య, వెంకటేశ్‌గౌడ్, సేవ్యానాయక్ తదితరులు ఉన్నారు.



స్వాగతం పలికేందుకు తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

వాహనం బోల్తా పడి డ్రైవర్ మృతి

నాగోలు: ప్రమాదవశాత్తు వాహనం బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోలు ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్ వివరాల ప్రకారం.. బిహార్ ప్రాంతానికి చెందిన అరుణ్‌రాయ్(31) హయత్‌నగర్ మండల పరిధి పసుమాములలోని ఆల్ రిచ్ డైరీ సంస్థలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో సంస్థ నుంచి టీఎస్ 11యూజీ 5476 అశోక్ లీల్యాండ్ వాహనంలో పాల ప్యాకెట్ల లోడ్ తీసుకొని వస్తుండగా వెంకటరెడ్డి నగర్ కాలనీ రోడ్ నెంబర్–4 వద్ద దిగువ ప్రాంతంలో వాహనాన్ని నిలిపి వెనుక టైర్ కింద రాయి పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఒక్కసారిగా వాహనం ముందుకు వెళ్లడంతో ఆపే ప్రయత్నంలో వాహనం వెనక పరిగెత్తుతుండగా పక్కనే ఉన్న షట్టర్‌కు ఢీకొని ఒక్కసారిగా అరుణ్ రాయ్‌పై బోల్తా పడింది. స్థానికులు గమనించి అరుణ్‌రాయ్‌ని బయటకి తీసి గాంధీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఉద్యోగానికి వెళ్లిన యువతి అదృశ్యం



లక్ష్మీదేవి

నాగోలు: ఉద్యోగానికి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సాయినగర్ గుడిసెల్లో ఉంటున్న మానుకింద లక్ష్మీదేవి (23) ఉప్పల్‌లోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో పనిచేస్తోంది. రోజు మాదిరిగా ఈనెల 4న ఉద్యోగానికి వెళ్లిన లక్ష్మీదేవి రాత్రైనా రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పని చేస్తున్నానని మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధిలోని ఎల్లారెడ్డికాలనీ, పవనగిరికాలనీ ఫేజ్–2లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. లెవల్స్ సమస్యతో దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న సమస్యను ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి లెవల్స్ సరి చేయించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు.రోడ్డును కబ్జా చేసి ర్యాంపులను నిర్మించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, కృష్ణగౌడ్, శ్రీనివాస్, రాజేందర్, మాధవరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఎల్లారెడ్డి, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

స్థలం కేటాయింపునకు కృషిచేస్తా

మన్సూరాబాద్: పద్మశాలి సంక్షేమ సంఘం భవనం నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానని నర్సింహారెడ్డి హామీ ఇచ్చారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన మన్సూరాబాద్ డివిజన్ పద్మశాలి సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు మంగళవారం కార్పొరేటర్‌ను కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. సంఘం సభ్యులు ఐక్యతతో ఉండాలని, సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లప్పుడు ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తయ్య, సత్యనారాయణ, వెంకటేశం, రుద్ర లక్ష్మి నర్సింహ, గుర్రం రమేష్, సీతా వెంకటేశం, నర్సింహ, సంతోష్ పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు



అవార్డులు అందుకున్న సిబ్బంది

లింగోజిగూడ: కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు వస్తోందని, ప్రతి ఒక్కరూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఆర్టీసీ హైదరాబాద్ రీజనల్ మేనేజర్ వరప్రసాద్ అన్నారు. హయత్‌నగర్ డిపో–1లో మంగళవారం మేనేజర్ విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రగతి చక్ర అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ ఎండీ ప్రవేశపెట్టిన ఎన్నో పథకాలు, ఉద్యోగుల కృషి ఆర్టీసీని ప్రజలకు మరింత దగ్గర చేస్తుందని తెలిపారు.ఉద్యోగుల సంక్షేమం కోసం డిపోలలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సదినియోగం చేసుకోవాలన్నారు. ఆర్టీసీలో ఉన్న అన్ని రీజన్‌ల కన్నా హైదరాబాద్ రీజన్ అన్ని విభాగాల్లో ముందంజలో ఉందని దానిలో హయత్‌నగర్ డిపో మొదటి స్థానంలో ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ సుచరిత, హయత్‌నగర్–2 డిపో మేనేజర్ శ్రీనివాస్ రావు, సిబ్బంది విజయ్‌కుమార్, శ్రీనివాస్, సత్తయ్య పాల్గొన్నారు.